# ఎదురుచేప

పెద్దింటి అశోక్‌కుమార్

**పగటి పూట ఎన్నడూ లేనిది పరుగెత్తుతున్నట్టుగా వచ్చిన లింగం 'రమా... నీకీ సంగతి తెలుసా' అన్నడు. అరగంటముందే రమకు విషయం తెలిసింది. అదే చెప్పి 'ఎవరు....?' అని అడుగుతుంటే పద్మ పేరు చెప్పి 'సిరిసిల్ల పోదాం' అని తొందరపెట్టిండు.**

**పద్మ పేరు వినంగానే రమకు కాళ్లకింద భూమి కదిలింది. అప్పుడు గిన్నెలు కడుగుతుంది. చేతుల పని ఆపి భయంగా 'నిజమా' అని అడిగింది.**

సిరిసిల్లలో ఉన్నప్పుడు ఈ మాటనే ఎన్నోసార్లు అడిగిందిత రమ. ఎప్పుడూ కాదనే చెప్పిండు లింగం. ఇప్పుడు మాత్రం అవును కాదని ఏదీ చెప్పకుండా 'ఏమో! అనవాళ్ళను బట్టి పద్మనే అనిపిస్తుంది. ఇంకో పేపర్ల పోటో ఇచ్చిండుగనీ గుర్తుపట్టరాకుంట ఉంది.' అన్నడు నీరసంగా కూర్చుంటు.

రమ గ్లాసులో మంచి నీళ్లు తెచ్చి ఇచ్చింది. గటగట నీళ్లు తాగి సేద దీరుతూ 'సిరిసిల్లలో ఇంతకాలం నేతకార్మికుల చావులనే చూసినంగదా... ఆకలిబాధ... అప్పుల బాధ... అనారోగ్యం.... ఇప్పుడు ఆడవాళ్లు ఎందుకు చస్తున్నట్లు... ఒక్కనాడే కార్గిల్‌లేక్‌లో రెండు శవాలా?..' అన్నడు బాధగా.

కార్గిల్‌లేక్ పేరు వినంగానే ఒకనాటి రాత్రి లింగం చెప్పిన నర్సింలు తండ్రి చావు గుర్తుకు వచ్చింది రమకు.

తలుపులు దగ్గరేస్తూ 'ఆడిది జేత్తే అడుగు వట్టిందట... మొగోడు జేత్తే మొగులు ముట్టిందట. సంపాయించే మొగోడే సచ్చినంక అప్పులతో ఆడిది ఎన్నిరోజులు ఈదుకత్తది... ఎంత గతి కచ్చెనే బిడ్డా.....' కండ్లకు నీళ్లు తీసుకుంది రమ.

అరగంటలో ఇద్దరూ నాన్‌స్టాప్ బస్సు ఎక్కి కూసున్నరు.

బస్సు ఎక్కుతుంటే లింగంకు వెంకట్రాది గుర్తుకు వచ్చిండు. ఆరునెలల కింద మాట. మొదటి సారిగా నిద్రకరువైన రాత్రి.

ఆ రోజు సిరిసిల్ల కొత్తబస్టాండులో బస్సెక్కుతున్న వెంకటాద్రిని చూసి 'అరే... వీడు అన్నంత పని చేసిండు. లక్ష్మిని విడిచిపెట్టి పోతండు...' అని లింగం అనుకునే లోపలనే బస్సుడిపో పక్కసందుల నుంచి పరుగెత్తుకచ్చిండు భూమరాజు. దించిన తల ఎత్తలేదు. పక్కలకు కూడా తిరిగి సూడలేదు. ఎవలో తరుముతున్నట్టు వచ్చి బస్సు ఎక్కిండు.

లింగం రెండు మూడుసార్లు పిలిచిండు. భూమరాజు చూడలేదు. అనుమానం వచ్చి పక్కకు తిరిగి చూసిండు లింగం. అటు పద్మ ఇటు లక్ష్మి ఎదురెదురు సందుల్లో నిలబడి భయం భయంగా చూస్తున్నరు.

అది ఇప్పుడు గుర్తు చేస్తూ రమతో ''మొన్న అమాలి దేవయ్య పోన్ చేసిండు. లక్ష్మి జాడనే లేదట. ఈ రోజు మనం పద్మశవాన్నే కాదు. లక్ష్మి శవాన్ని కూడా చూస్తం. మున్సిపాలిటీ చెత్తలో కుళ్లిపోయి ఉంటుంది. ఏట్రక్కు డ్రైవరును అడిగినా చెప్పుతడు'' అన్నడు.

బస్సు రాంనగర్ దాటి వేగాన్ని అందుకుంది.


లింగం ఊరిలో ఉన్నప్పటి మాట ఊర్లో ఉన్నప్పుడు వెంకటాద్రి ఒకసారి భార్యతో మాట్లాడుతూ లక్ష్మిని 'ఆవు' అన్నడట. అంతే! కమల కోపంతో ఇంతెత్తు లేచిందట. దుబాయి విజా వచ్చి అప్పుకోసం తిరుగుతున్న వెంకటాద్రి లింగంను కలిసినప్పుడు తన నిర్ణయాన్ని చెప్పుతూ ''ఏం చెయ్యిమంటవురా... కరువు అందరిని ఆగం జెయ్యవట్టె... కటికోనికి అమ్ముదామంటె మనుసొప్పుతలేదు. నేను ఒకనాడు ఆవు అన్నందుకే గయ్యిమని లేచింది కమల. దాన్ని ఆవు లెక్క చూసుకుంటున్నమా అన్న కమల నేరా... ఈ ఆలోచన చెప్పింది' అని మొఖం చిన్న బుచ్చుకున్నడు.

'వద్దు వద్దు.... లక్ష్మి ఒక్కడనే ఉండని' గట్టిగా చెప్పిండు లింగం.

ఆరోజు బస్టాండు నుంచి ఇంటికి వచ్చిన లింగం రమతో ఇదంతా చెప్పి ''ముందు నేను వెంకటాద్రినే చూసిన... తర్వాతనే లక్ష్మిని చూసిన. అప్పటికే బాధతో ఉన్నానంటే భూమరాజును చూసి గుండె ఆగినంత పనయిందనుకో... పద్మనైతే గుర్తుపట్టలేక పోయిన. బంతిపువ్వు లెక్కుండే పిల్ల. కట్టెపుల్లయింది'' అన్నడు.

అప్పటికే కూరకు రాత్రి దాటింది. ఇద్దరు తిండికి కూర్చున్నరు. పిల్లలిద్దరూ నిద్రపోయింద్రు.

రమ అన్నం పెడుతుంది. లింగం పద్మ గురించే చెప్పుతున్నడు. రమ మాత్రం లక్ష్మి గురించి ఆలోచిస్తుంది. చచ్చిపోయిన దాని లేగదూడ గుర్తుకచ్చింది.



కమల హాస్పిటల్ నుంచి ఇంటికి వచ్చిన రోజు చూద్దామని ఊరికి వెళ్లింది రమ. మాటల మధ్యలో కమల నిర్ణయం విని 'ఆ జనాల నడుమ...

నరడివిల అది ఎట్ల బతుకుతది...' అని అడిగింది. అదే ప్రశ్నను ఆ రాత్రి లింగంను అడిగింది.

అన్నం కలుపుతున్న లింగం పద్మ గురించే అనుకొని 'రమా.. దాని బతుకు ఇప్పుడు గాదు... ఎప్పుడో ఆగమ్మైంది. పర్శరాములు పద్మను ఏరికోరి చేసుకున్నడు ఇప్పుడు పెండ్లి చెయ్యలేనంటే ఖర్చంతా తనే పెట్టుకున్నడు. తండ్రిలేడు.. ఒక చెల్లె, తల్లి. మూడేండ్లు నిండనే లేదు. నూరేండ్లు నింపుకున్నడు' అన్నడు అన్నం కలుపుతూ...

అది ఇప్పుడు గుర్తు చేస్తూ లింగం 'రమా.... ఆరోజు నువ్వు లక్ష్మి గురించే అడిగినవు. నేను పద్మ గురించే అనుకున్న .... విజయవాడ నుంచి తిరిగివచ్చిన రోజు తెలిసిందనుకో...నువ్వు లక్ష్మి గురించే కలువరిస్తున్నట్టు...' అన్నడు.

బస్సు చప్పుడుకు రమకు ఆ మాటలు వినిపించలేదు.

వినిపిస్తే మాత్రం ఆరోజు చెప్పిన సమాధానమే చెప్పేది. కమల హాస్పిటల్ నుంచి ఇంటికి వచ్చిన రోజు వెళ్ళకుండా ఉంటే రమకు ఆ సంగతి తెలిసేదే కాదు.

''మీ పిల్లలకు పాలు చాలడం లేదని నువ్వు చెప్పినంక దాని లేగకు పాలు విడిచిపెట్టనేలేదు. మూడు నెలలకే లేగ దూడ చచ్చిపోయింది. లక్ష్మి ఒగ తల్లడిల్లుడు కాదు. పాలు ఇయ్యదని భయపడి మరుగు మందుపెట్టిన'' ఆ రోజు కమల చెప్పింది.


అదే గుర్తు చేసుకుంటూ విజయవాడ నుంచి లింగం వచ్చినరోజు ''నా పిల్లలను బతికించడానికి తన బిడ్డను చంపుకుంది. కష్టకాలంలో దానికి పిడికెడు మేతను పెట్టలేకపోయిన'' అన్నది.

ఇవే మాటల్ని లక్ష్మి, పద్మలను లింగం బస్టాండులో చూసి ఇంటికి వచ్చి చెప్పిన రాత్రి కూడా చెప్పింది. ఆ రాత్రి ఇద్దరూ అన్నం ముట్టలేదు. కలిపిన అన్నం ఒక బుక్క కూడా తినని అలాంటి మరో రాత్రిని గుర్తు చేసుకున్నడు లింగం.

అప్పటికి లింగం సిరిసిల్లకు రాలేదు. ఐదేండ్లు కరువు. నాగటి మీది ఎడ్లను అమ్ముకొని బతుకుదెరువు కోసం వెదుకుతున్నడు. వెంకటాద్రి దుబాయి వెళ్ళాలని తిరుగుతున్నడు. ఒకలిద్దరు లింగంతో 'భూమరాజు నీకు దోస్తేగదా... వాళ్ళ అల్లుడు లేడా..? అన్నరు.

అప్పుడే భూమరాజు కష్టాల్లో ఉన్ననని దేవమ్మను కొలుచుకున్నడు. చుట్టాలను పిలుచుకున్నడు. రాత్రి బంతి బోజనం, పక్కనే పర్శరాములు. ''ఒక్క మానునే కాదు బిడ్డా! అందరం ఆగమ్మైనం. సిటీలో అయితే ఏదో పని దొరుకుతుంది. ఇక్కడ ఏం దొరుకుతది... నేను సిరిసిల్లకే వద్దామనుకుంటున్న. రంగులద్దుడో... సుతారి పనో ఏదో ఒకటి చూపెట్టరాదు'' అడిగిండు లింగం ఎంతో ఆశతో.

పర్శరాములు జాలిగా చూసి 'ఇక్కడ ఆకలితో ముడుసుక పన్నా మంచిదే మామా... ఆ రంగులద్దే పనికి రానేవద్దు. ఇక్కడ కనీసం నీళ్ళయినా మంచిగ దొరుకుతయి. అక్కడ తాగుదామంటే నీళ్లు గూడా



దొరకయ' అన్నడు.

ఏదో ఆదారం దొరుకుతుందనుకున్న లింగం ఆశ నిరాశయింది. అన్నం తినడం ఆపి 'మా ఊరి నుంచి ఎంతో మంది వచ్చింంద్రు... అదే పని చేస్తుంంద్రు గదా' అన్నడు.

పర్శరాములు విరక్తిగా 'కరువు ఇక్కడగాదు... అక్కడ గూడా ఆగం జేస్తుంది మామా.... దీపంచుట్టు పురుగులు ముసిరినట్టు చుట్టుపల్లెలన్ని సిరిసిల్లకు ముసురుతున్నాయి. పోంగ మంచిగనే పోతున్నరు గనీ రాంగ రోగాలతో వత్తున్నరు. ఏనుగసొంటి మనుషులు మామా... పీనుగులైతుంంద్రు. ఇక్కడ పేగులు మాడి చస్తరు... అక్కడ పేగులు కాలిచస్తరు' అన్నడు.

అప్పుడు అతనేదో తననుంచి తప్పించుకోవడానికి అన్నాడనుకున్నడు లింగం. సిరిసిల్లకు వచ్చి రంగులద్దేపనిలో చేరిన వారం రోజులకు రమతో ఇదే మాట చెప్పి "అది నిజమేనే... నాతోపని చేసే పోశెట్టి బాగలేడు. కడుపుల ఏదో అయిందంట. ముందు రంగులద్దే పని మానెయ్యిమని డాక్టర్ చెప్పిండట. మనిషి బతుకనే బతుకడంటున్నరు. ఈడు సిన్నదే ఇద్దరు పిల్లల తండ్రి. మన లెక్కనే బతుకుదెరువు కోసం వచ్చిండట..." అన్నడు.

ఓ వారం అటుఇటుగా నెల తర్వాత పర్శరాములు సిరిసిల్లలో కలిసిన లింగంను ఆశ్చర్యంగా చూస్తూ 'మామా... వత్తనని రానేవచ్చినవా...' అన్నడు.

అప్పుడు వాళ్లిద్దరూ నెహ్రూనగర్‌లోని అంబబాయి గుడి సందులో ఉన్నారు. పర్శరాములు భీంను సైకిల్ మీద వేసుకుని పోతున్నడు. పోశెట్టి చావును మరిచిపోని లింగం కలవరంగా అద్దకం పనికి పోతున్నడు.

సైకిల్ ఆపిన పర్శరాములు పాలిపోయిన లింగం చేతులు చూస్తూ "డైయింగ్ పని మంచిది కాదు మామా... ఇట్లసచ్చే బదలు ఆకలితో సచ్చిందినయం. మా నాయిన... ఇదే పనితో..." చెప్పలేక కన్నీళ్లను ఆపుకుంటూ వెళ్లిపోయినవాడు మరునాడే లింగంను వెదుక్కుంటూ వచ్చిండు.

అదే విషయం పర్శరాములు చనిపోయిన రాత్రి రమతో చెప్పుతూ "ఈ రోజు పిడికెడు మెతుకులు తింటున్నమంటే ఇది ఆయన పెట్టిందేనే... మందులు కొనుక్కోలేక పోశెట్టి పురుగు మందు కొనుక్కున్నడనీ నీకు చెప్పిన గదా.... నేను అదే బాధతో ఉన్న. పర్శరాములు వచ్చి ఆ పని వద్దుమామ అంటడు. నీకు ఆరు సాంచాలున్నయి గదా. ఆ పని నేర్పు. ఒక పూట నేను నడిపిస్త.' అన్న నవ్వుకుంట అప్పుడు ఏమన్నడో తెలుసునా..." అంటూ మొఖం నిండా గడ్డం, ఎర్రగా ఉన్న కండ్లు డొక్కలు ఎండుకపోయి సొలుగుతున్న ఆనాటి పర్శరాములు రూపాన్ని గుర్తుకు తెచ్చుకున్నడు లింగం.

షెడ్డునిండా పొగలు, ఘాటుగా వాసన, చేతులకు లబ్బర్లు ఏసుకొని క్యాన్‌ల నుంచి రంగును వంచుతున్న లింగంను చూసి 'మామా... ఆరు సాంచలున్నదే కనవడుతుంది. లోపల అప్పు ఎంతనో కనవడుతలేదు. డైయింగ్ పని చేస్తే నువ్వొక్కనివే చస్తవు. సాంచాలు నడిపితే పెండ్లాం పిల్లలు గూడా చస్తరు' అన్నడు పర్శరాములు.

తలపైకెత్తిన లింగం 'అదేంటిదల్లుడా... కాంగర్‌కు గోసగని ఆసాములకేం బాధలేదటగదా... కరంటు సబ్సిడీలు మీకే నట... లోన్లు మీకే నట.. మీ మీద సేట్లుంటరటగదా.. వాళ్లయితే కోట్లు సంపాదిస్తున్నరట...' అన్నడు.

పర్శరాములు విరక్తిగా నవ్వి "ఒకలకు లాభమని ఒకలనుకుంటున్నరు. ఎవలకూ లాభంలేదు. ఎవలకూ సుఖం లేదు. చెవులు పలిగిపోయే చప్పుడులో కాంగర్ ఎంత బాధతో ఇంటికిపోతడో అంతకంటే ఎక్కువ బాధతో లక్షలు పెట్టువడిపెట్టిన సేట్లు ఇంటికి పోతరు. నువ్వన్నట్టు సిరిసిల్లల కోటీశ్వరులు ఎవలంటే శాలోల్లే... కూటికిలేక సచ్చేది ఎవలంటే శాలోల్లే... అది అంతే మామా... ఎక్కడేం జరుగుతుందో తెలువదిగనీ సముద్రంలనే వానవడ్డట్టు పైసున్న జాగలకే పైసవోతుంది' అన్నడు.

మసులుతున్న రంగునీళ్ళల్ల బట్టను ముంచుతూ "గట్లెందుకల్లుడా.. మీరు దారం తెచ్చుడు బట్ట ఇచ్చుడే గదా... అమ్మిన దరల సగమైనా కాంగార్లకు ఇయ్యరట. అది లాభమేగదా..." అన్నడు లింగం.

"లాభమేడిది మామా... అంతా మార్కెట్ మాయ.. ఆసగంల మేము ఎందరిని సాదాలే... కొద్దిగ ఈకె తీడేవరకు సేటు బట్ట మందమంటడు. లేకపోతే కాంగర్లు బందువెడుతరు. ఇది ఇప్పుడు గాదు మామా ఇంగ్లోషోని కన్నువడ్డనుంచే మొదలయింది." అన్నడు పర్శరాములు.

పర్శరాములు చనిపోయిన రాత్రి చెప్పిన ఈ ముచ్చటనే లక్ష్మిని పద్మను బస్టాండులో చూసిన రాత్రి మరోసారి గుర్తు చేస్తూ "రమా.. ఆరోజు గూడా చెప్పిన. ఇప్పుడు గూడా చెప్పుతున్న. ఆయన కండ్ల నిండా నీళ్లు తీసుకున్నడే.. పొద్దుగూకే వరకు నన్ను ట్రాన్స్‌పోర్ట్‌లో అమాలిగా పెట్టిండనుకో... నేను అనుకోలేదు. ఈ పిల్లగాడు ఇట్లచస్తడని. కొద్దిరోజులకే గదా... అర్ధరాత్రిపూట నడుస్తున్న సాంచాల నడుమ ఉరివెట్టుకుని సచ్చిండు" అన్నడు లింగం.

రమ వింటూ అన్నం కలుపుతుంది. లక్ష్మిని, పద్మను చూసిన బాధతో లింగం చెప్పుకపోతున్నడు. ఇద్దరు పిల్లలు నిద్రపోతున్నరు. లింగం పద్మ గురించి, పర్శరాములు గురించి చెబుతుంటే రమ లక్ష్మి గురించే ఆలోచిస్తుంది. ఆలోచిస్తుంటే చూపు పిల్లల దిక్కు తిరిగింది.

ఇద్దరిదీ కష్టపుకానుపే! పాలుపడలేదు. బర్రెపాలు డబ్బపాలు పిల్లలకు ఇముడలేదు. మొదటి కాన్పు ఇట్లనే సచ్చిపోయింది. ఈ కాలంలో ఆవులు ఎక్కడుంటయని జాడతీస్తే వెంకటాద్రి దగ్గర ఉన్నట్టు తెలిసింది. రమ జన్మనిచ్చినా ఇద్దరు పిల్లలకు లక్ష్మి జీవితాన్నిచ్చింది. మందల నుంచి పొద్దున్నో మాపున్నో ఇంటివైపు తొంగి చూసేది లక్ష్మి. రమ దాని కోసం తౌడు, పల్లిపిండి పచ్చిగడ్డిని తయారుగా ఉంచేది.

ఈ విషయమే చాలాసార్లు కమలతో అంటే 'అది మా ఇంటిదీపమే' అన్న కమలనే హాస్పిటల్ నుంచి ఇంటికి వచ్చిన రోజు రమతో 'దీనిక సావులేదు. చాతగానే నేనున్న... దీన్ని ఎవడు సదురాలె.... నాగండాన మోపయింది' అని విసుక్కుంది.

రమకు ఆ విషయం ఆ రాత్రి గుర్తుకువచ్చి అన్నం సహించలేదు.

ఇద్దరూ ఒకేసారి లేచి చెయ్యి కడుక్కున్నరు.

అదే విషయం గుర్తు చేస్తూ "ఆరోజు మొదలు... మనం రోజూ లక్ష్మి కోసమో, పద్మ కోసమో వెదుకుతూనే ఉన్నం కదా..." లింగం అన్నడు.

బస్సు కమాన్‌పూర్ దాటింది.

రమ కిటికీలోంచి బయటకు చూస్తూ 'రేపటి నుంచి మనకా బాధ ఉండది గదా...' అన్నది

'కరీంనగర్ వేళ్లేముందు ఏమనుకున్నం... ఉన్నమా...?' లింగం అన్నడు.

లింగం సిరిసిల్లలో ఉన్నప్పుడు ఊరికి వెళ్లి ఒక ఆదివారం పద్మను చూసివస్తుంటే భూమరాజు కనిపించిండు. అప్పటికి పర్శరాములుకు నెల మాసికం పెట్టనేలేదు.

భూమరాజు ఏడుస్తూ 'ఎంత పనాయెరా... లింగం... బిడ్డ బతుకు ఆగమైపాయె. పాణంతో కొట్లాడాలెగనీ... సచ్చి ఏం సాధిస్తంరా... ఇప్పుడు దాని బతుకెట్లరా' అన్నడు.

ఆ మాటలు ఇప్పుడు గుర్తుకువచ్చి సీట్లో ఒరిగి కూర్చుంటూ లింగం "పిల్లల గంటముగని వాళ్లరా తలు గంటమా భూమున్నా... కండ్లు వొడగొట్టిన


## సరైన వ్యక్తి కోసం ఎదురు చూస్తున్నాను....!




**ముద్దు పేరు:** జింజర్

**ఇష్టమైన ఆహారం:** ఇంటి భోజనమే! దానికి ఏదీ సాటిరాదు.

**అభిరుచి:** పెయింటింగ్, డ్యాన్స్

**ఇష్టమైన సినిమా:** రొమాంటిక్ సినిమాలంటే ఇష్టం. ఎక్కువగా అవే చూస్తాను.

**ఇష్టమైన నటి:** షర్మిలా టాగూర్. ఆవిడ ఎంత అందగత్తో చెప్పలేను.

**ఇష్టమైన ప్రదేశం:** కాశ్మీర్. మా కుటుంబంతో మాత్రమే చూడాలనుకుంటున్నాను.

**మనసు దోచిన వ్యక్తి:** ఇంతవరకూ ఆలాంటి వ్యక్తి ఎదరుపడలేదు. నేనూ ఎదురు చూస్తున్నాను.

దేవుడు ఇండ్లు జూపిత్తడు' అని ఏదో చెప్పి భూమరాజును ఊకుంచినగనీ నా గుండె చెరువైంది... ఇదే కార్తిల్‌లేకల నర్సింలు తండ్రి కాళ్లకు తాడుగట్టుకుని చచ్చిపోయిన రాత్రి కొంత నిజం తెలిసిందిగనీ అంతదాక పద్మకేం దొర్సాని. దాని అన్నం కుక్కలు తినయి అనుకున్ననే'' అన్నడు రమతో.

'ఏమిటా నిజం' అని ఇప్పుడు అడుగలేదు గనీ ఆ రోజు రాత్రి లేటుగా వచ్చిన లింగంను రెండుసార్లు అడిగింది రమ.

అప్పుడు ఆ రెండుమాటలు చెప్పడానిక్కూడా మాటలు రానంత బాధతో ఉన్నడు లింగం. నర్సింలు తండ్రి చావుకు కారణం ఎవరని తనలోతాను తర్కించుకుంటున్నడు.

నర్సింలు పర్శరాములు షెడ్డులో కాంగర్. వారం రోజులు రాత్రిపూట వారం రోజులు పగటి పూట సాంచాలు నడిపేపని. ఎప్పుడూ వరుసగా మూడు రోజులు వచ్చింది లేదు. పనికి సక్కగ రాడని ఎవలూ పనిలో పెట్టుకోలేదు.

సిరిసిల్ల రథాన్ని చూడడానికి వచ్చిన భూమరాజు మార్కండేయ సందిలో లింగంను కలిసి ఇదే విషయం చెప్పి 'వాడు వట్టి పనిదొంగ నటరా.. ఎప్పుడూ ఫైసలడుగుతడట. అసలే కరంటు కోత... భీములు ఎక్కువ దొరుకయి.. నడిచిన నాలుగు రోజులు బందువెట్టుకుంటే ఎట్ల...' అన్నడు.

రథం రోజు పొద్దున తండ్రిని చూడంగానే మీద వడి ఏడ్చింది పద్మ. ఏడుస్తూ 'నాయినా మూడు రోజులాయె.... వాడు జాడలేడు పత్తలేడు. రాత్రి పగలు ఒక్కడే నడుపుతుండు... ఊర్లె మనసులే లేరా... ఇట్ల నిద్రలేకుంటె మనిషయితడా...'' అన్నది.

ఆ మాటలనే బాధతో లింగంతో చెప్పుతూ 'పర్శరాములు నీకే వింటడురా... ఓ కొత్త మనిషిని పెట్టుకొమ్మను' అన్నడు బతిమిలాడుతూ భూమరాజు.

ఆనాడు రాత్రి లింగం పర్శరాములు ఇంటికి వెళ్లి నాలుగు మాటలన్నడు. 'ఇంట్లోంచి వచ్చిన పద్మ' అట్లడుగే బాపు.. వాడు అడుగువెట్టిండంటే మేము అడుగువట్టినం...' అన్నది.

పర్శరాములు మాత్రం నెమ్మదిగా 'నర్సింలు మంచోడు మామా.... మంచి పనోడు. వాటం దప్పితే బీంలు నింపుకుంటడు. సాంచాలు రిపేర్ చేసుకుంటడు. ఇంట్ల పరిస్థితి బాగలేక ఆగమైతుండు... అంతే. తల్లికి తండ్రికి బీమారే.. పెండ్లాం యాడాది కిందనే అవ్వగారింటికి అలిగిపోయింది. వీడు దవాఖాన్లు తిరుగుడుకే సరిపోతండు' అన్నడు.

పద్మ అక్కడనే నిలబడ్డది. యాష్టగా ''అది మంచి పని చేసింది. ఎన్ని రోజులు ఏగిత్తరు. అదీ మనిషే గదా... నేనదే పనిజేస్త'' అన్నది.

ఈ సంగతి వారం తర్వాతగానీ రమతో చెప్పలేదు లింగం. నర్సింలు తండ్రి చనిపోయిన రాత్రి చెప్పక తప్పింది కాదు. ఆ రోజు ఆమెతో చెప్పలేదన్న విషయాన్నే గుర్తు చేస్తూ వారం తర్వాత ''ఆరోజు అది మాములు ముచ్చటనే అనుకున్న భార్యాభర్తలు ఏమనుకున్నరో... తెల్లారే నర్సింలును పనిల నుంచి తీసేసిండట. ఆ రోజు వాని తండ్రి శవమై తేలిండు. చందాలు వేసి సందం చేసిండ్రట. వాడు ఇంతకు ముందే పర్శరాములు ఇంటికి వచ్చిండు. అప్పుకోసం వచ్చిండనుకున్న అసలు నిజం తెలిసిందే. ఆ చావుకు కారణం నేనే...'' అన్నడు ఆ రాత్రి బరువుగా ఇంటికి వచ్చిన లింగం.

అప్పుడు అర్ధరాత్రి దాటింది. రమ నిద్రలో ఉంది. లింగం చెప్పిన మాటలు విన్నంక నిద్ర ఎప్పుడో తేలిపోయింది. ఏమిటి నిజం అని రెండుసార్లు అడిగినంక గానీ లింగం నోరు తెరువలేదు.

ఇంట్లోంచి వచ్చిన పద్మ నర్సింలును చూసి 'ముట్టడు ముట్టడు దూరముండు దూరముండు' అంటనే ఉంది. నర్సింలు వచ్చి పర్శరాములు కాళ్ల మీద పడ్డడు. ఆ సంఘటనను గుర్తు చేసుకుంటూ ఇంటికి వచ్చిన లింగం కండ్లల్ల నీళ్లు తిరుగుతుండగా రమతో ''కొడుకు చేతుల పనిపోయిందన్న బెంగతో తండ్రి చచ్చిండట. 'ఇప్పుడు నాకు పని ఇవ్వకపోతే నా తల్లి గూడా బతుకది.. నన్ను పనిలోకి తీసుకో అన్నా... అంటూ వాడు కాళ్లు విడువలేదు. నాకు ఏడుపు వచ్చిందనుకో... పర్శరాములు మాత్రం ఆవగింజంత కరుగలేదే'' అన్నడు.

అప్పుడు రమ అన్నం పెడుతుంది.

తింటూ నర్సింలు ముచ్చటనే చెబుతున్నాడు లింగం.

''అన్నా... ఇన్ని రోజులు ఆదుకున్నవు. ఒక్క యాడాది ఆదుకో... తర్వాత నేను ఉండుమన్నా ఉండ'' నర్సింలు ఏడుస్తూ అన్నడు.

పర్శరాములు వాకిట్లనే కూర్చున్నడు. సాంచాలు నడువక అప్పటికి రెండు రోజులు. వార్పర్లు లేరని సాకు జెప్పి సేటు ఆ రోజు కూడా భీములు ఇవ్వలేదు. తిరిగి తిరిగి అలసటతో ఉన్నడు. అలసట కోపంగా మారి ''నీ బాధలు నాతో చెప్పుకుంటున్నవు. సరే! నేనెవరితో చెప్పుకోవాలె... రోలుకు ఒకదిక్కంటే మద్దెలకు రెండు దిక్కులు. నిన్ను నేను పాపమంటే నన్ను ఎవడు పాపమనాలె... రెండు లక్షలు అప్పుదెచ్చిన. అవి ఇప్పుడు నాలుగు లక్షలయినయి. రేపు వాడు షెడ్డుకు తాళమేత్తడట'' అంటూ ఇంట్లకు నడిచిండు పర్శరాములు.

అన్నం తిన్న తర్వాత గూడా బాధగా ఈ సంగతి చెబుతూనే ఉన్నడు లింగం. ''పర్శరాములుకు పుట్టెడు అప్పులున్నయే. సాంచాలు వెట్టి అప్పులు పెంచుకున్నడు. తను బతికి నలుగురికి బతుకుదెరువు ఇస్తననుకున్నడు. కానీ ఆయనన్నే బతుక్కు దూరమయిండు.''

రమ లైటార్పి పడుకుంది.

అప్పుడు పద్మ గురించి పర్శరాములు గురించి ఏడ్వటం తప్ప ఏమీ అడగని రమ వెంకట్రాద్రి లక్ష్మిని విడిచిపెట్టి బస్సు ఎక్కిన రాత్రి మాత్రం 'లక్ష్మికి మేత ఎట్ల దొరుకుతది... ఒంటిగ ఎట్ల బతుకుతది' అన అడిగింది లింగంతో.

ఇదే ప్రశ్నను ఊరికి వెళ్లినప్పుడు కమలను గూడా అడిగిండు లింగం.

అప్పుడు పొద్దు గూకుతుంది. స్కూల్‌నుంచి వచ్చిన ఇద్దరు పిల్లలు అన్నం లేదని ఏడుస్తున్నరు. కడుపుల ఏదో మరిచిపోయినమని కమలకు మళ్లీ ఆపరేషన్ చేసిండ్రు డాక్టర్లు. వెంకటాద్రికి అప్పు ఎక్కడా పుడుతలేదు.

కమల విరక్తిగా ''బతుకకపోతే సావని. మేము సత్తలేమా.. అక్కడ దొరుకది సరే! ఇక్కడ మాత్రం దొరుకుతుందామేత..'' అన్నది.

రమ ప్రశ్నకు సమాధానంగా ఆ రాత్రి కమల చెప్పిన విషయమే చెబుతూ ''ఇది ఎంత చిత్రమో చూడు... పద్మ గురించి ఇదే ప్రశ్న అడిగినప్పుడు అటు ఇటుగా భూమరాజు ఇదే సమాధానం చెప్పిండు. అది అక్కడి పిల్లనే గని ఇక్కడి పిల్లగాదురా... ఇంకో ఇద్దరు ఆడిపిల్లలున్నరు. అది ఇంటిమీదుంటే వాళ్ల పెండ్లీలెట్ల... అని కండ్లకు నీళ్లు తీసుకున్నడే' అన్నడు.

అదంతా ఇప్పుడు గుర్తుచేసుకుంటూ ''ఆనాడు భూమరాజు అన్నమాట ఇప్పుడు నాకు బాగా గుర్తు. వద్దు పద్మ నీదగ్గరనే ఉండని అని నేను చెప్పినా వినలేదు. ఎక్కడి గడ్డి అక్కడనే మాడిపోవాలె అన్నడు. ఆఖరకు పద్మ ఇట్ల మాడిపోయె.'' అన్నాడు.


తలూపుతూ బయటకు చూసింది రమ. బస్సు కొదురుపాక చేరుకుంది. కొత్తగా పోస్తున్న మిడ్ మానేర్ కట్ట వంకలు తిరిగి పాములా కనిపిస్తుంది.

బస్సు ఎక్కంగనే రమకు నిద్రలకు జారుకునే అలవాటు. ఇప్పుడు ఆమె ముఖంలో ఆందోళన తప్ప నిద్రలేదు.

''రమా... ఈ వార్త ఊర్లో తెలిసిందంటవా... ఎన్నడో ఈ ఇద్దరి చావు వార్తను మనమే ఊరికి చేరవేస్తిమంటిమి గదా... మనకే 'పేపర్ చేరేసింది' లింగం అన్నడు.

బస్సు కుదుపులకో... నిజంగానో కాని... రమ తలూపుతూ 'అప్పుడు గూడా ఇదేమాట ఇట్లనే అనుకున్నం.' అంటూ విజయవాడ నుంచి వచ్చిన రోజును గుర్తు చేసింది.

సరిగ్గా అది పద్మ లక్ష్మిలు సిరిసిల్లకు వచ్చిన ఏడవరోజు. లక్ష్మి కోసం రోజూ వెదుకుతున్నాడు లింగం. రోజులాగే ఆరోజు కూడా వెతికి ఇంటికి వచ్చి ''అరే ఇది ఏమైనట్టు.. గోపాల్‌నగర్, నెహ్రూనగర్, శివనగర్, బివైనగర్ అన్నీ చూసిన ఎక్కడలేదు. ఇంక తావు కుదిరినట్టులేదు'' అన్నడు.



'రేపు ఆదివారం... పొద్దంతా వెతుకాలి' అని అనుకున్న అరగంటకే సేటు నుంచి ఫోన్. లోడ్ లారీతో విజయవాడ వెళ్లాలని ఆడర్.

విజయవాడ నుంచి మూడో రోజు తర్వాత తిరిగి వస్తూ ముందుగా పద్మను కలువాలనుకున్నడు లింగం. బాగా వర్షం అయినా లెక్క చేయకుండా బయటకు వచ్చిన లింగం పొద్దంతా తిరిగి ఇంటికి చేరుకుని రమతో 'అప్పుకిందికి ఇల్లును సాంచాలను జప్తు చేసిండ్రట. పక్క గుడిసెలో తల్లి కూతుర్లుంటున్నరు. పద్మ ఎక్కడనో ఒంటిగా కిరాయికుంటుందట.... అడ్రస్ అడిగితే తెలువదన్నరు' అంటూ ఆమె మొఖంలోని ఆందోళనను చూసి పద్మ గురించి చెప్పిండు లింగం.

''లక్ష్మి మాత్రం బివైనగర్ జండా దగ్గర కనిపించిందే... పెయ్యిమీద బొక్కలే ఉన్నయి. వానలో తడిసి వణుకుతుంది. కనీసం చెట్టుకింద నిలబడదామన్న ధ్యాసకూడా లేదు. ఇద్దరి చావువార్తను ఎన్నడో ఊరికి మనమే మోసుకపోతం'' అన్నడు.

రమ చలించలేదు. అంతకు రెండు రోజుల కిందనే లక్ష్మిని చూసింది. అది మున్సిపల్ ఆఫీస్ ముందున్న పెద్దమోరిలో నీళ్లు తాగి చెత్తకుండిని మూతితో ఆశగా గెలుకుతుంది. దానిని అట్ల చూడలేక కలవరంగా ఇంటికి వచ్చి మనుసును రాయి చేసుకోవాలనుకుంది. కాని మరునాడు ఫంక్షన్ హాల్ చెత్తకుండి ముందు పద్మ కనిపించి మరింత కలవరపెట్టింది.

అది ఇప్పుడు గుర్తు చేసుకుంటూ కండ్లకు నీళ్ళు తీసుకుంది రమ. లింగంతో పనిచేసే హమాలీలకు గూడా లక్ష్మి గురించి తెలిసింది. ఒకనాడు ఒక హమాలి లింగంతో 'అదేం ఆవురా.. మొన్న రోడు మీదనే పన్నది. నేనే దూరం గెదిమిన. దానికి యాడుండాలెనో యాడ పండాలెనో తెలువనట్టుంది. ఏదన్నలారీ గుద్దితే పనికతం...' అన్నడు. ఆనాడు తెల్లారే చేతికి కట్టుతో మార్కెట్‌ల పద్మ కనిపించింది. పిచ్చిదానిలెక్క తిరుగుతుంది. పిలిచేలోపలనే మాయమయింది. బస్సు శాభాష్‌పల్లె వాగు దాటి గడ్డ ఎక్కింది.

ఆ సంగతులన్నీ మనసులో మెదులుతుంటే ''ఇంకో ఆదివారం పద్మ అడ్రస్ తెలుసుకుంటనని మబ్బుతోనే పోయిన చూడు... నీకు బాగా యాది కుండాలె... మన పక్కింటి ముత్తయ్య ఎండ్రిన్ తాగి సచ్చిండు. సూడు... ఆనాడు బీవైనగర్‌లో జాడపడ్డది... చూడు' అని రమకు ముత్తయ్య చచ్చిన రోజును గుర్తు చేసిండు లింగం.

ముత్తయ్య నేత కార్మికుడు. నెల రోజులు ఆర్డీవో ఆఫీసుముందు మూడు పైసల పగారు పెరుగుడు కోసం ధర్నా చేసిండ్రు. చేతుల పని పోయింది గని పగారు మాత్రం పెరుగలేదు. పదేండ్ల కింది ధరలు ఇప్పుడులెవ్వు... కాని పగారు మాత్రం పదేండ్ల కిందిదే... ముత్తయ్య పన్నెండు గంటలు ఎనిమిది సాంచాలు ఒక్కడే నడుపుతడు. వచ్చిన పగారు ఎటూ అందుతలేదు... పొందుతలేదు.... ఇంట్ల కొట్లాట. పెండ్లికచ్చిన ఇద్దరు బిడ్డలున్నరు.

ఆనాడు బీవైనగర్‌లో తిరిగి తిరిగి ఇంటికి వస్తూ రమతో 'పద్మ కనిపించలేదుగనీ ఇల్లు దొరికింది. ఇంటి ముందు గుంపుగా ఆడోళ్ళున్నరు. ఏదో తిడుతున్నరు. ఎందుకో అర్థం కాలేదు ఇది ఇల్లు గాదు. గుడిసెగాదు... సగం వరకు సిమెంట్ ఇటుకలు సగం వరకు తడకలు. మీద విరిగిన రేకులు. ఎండ తప్ప వాన చలి గుడిసెలనే ఉంటయి... ముందట పెద్ద మోర. పందులు కుక్కలు... దోమలు, వాసన... పద్మను కలువాలంటేనే భయమయింది. ఎనుకకు మర్రిన' అంటూ బాధగా ఉన్న రమను చూసిండు.

రమ అప్పుడే వచ్చినట్టుంది. చేతిలో బీడీల ఆకు, తంబాకుంది. తన బాధను చెప్పుకుంటున్నట్టు బీడీల మాపును ఇచ్చి ''నేను అట్లా సాయిబాబా గుడి ముందు నుంచి వస్తున్నవా... అయ్యప్ప గుడి దగ్గర నుంచి ఎవరో రైతు లక్ష్మిని తిడుతూ తరుముకుని వస్తుండు. దాని వీపు మీద వాతలు దేలినయి. దొరికిన రాయితో మట్టిపెల్లతో విసురుతూ 'నీ గత్తరాను... సావ తయారైనవు.. నీకు దొంగ తిండిగావలెనా...!' అంటూ తరుముతున్నడు'' చెప్పింది రమ.

అది ఇప్పుడు గుర్తు చేస్తూ లింగం ''పక్కింట్ల పీనుగుంటె ఇంతసేపు ఎక్కడ తిరిగినవని తిడుతవనుకున్ననే'' అన్నాడు. రమ కూడా ''నన్నూ అట్లనే అంటవనుకున్న నీకంటె పది నిమిషాల ముందే ఇంటికచ్చిన'' అన్నది.


బస్సు సంకెపల్లి రుద్రంగి మలుపు దాటి నాంపల్లి గుట్టకు చేరుకుంది.

ఇద్దరికీ గుండెల దప్పులేగుతున్నయి.

'ఎక్కడ దిగుదాం...' అడిగింది రమ.

'ఇంకెక్కడ... పాత బస్టాండుల దిగి సర్కారు దవాఖాన్లకు పోతే అన్ని సంగతులు తెలుస్తయి' అన్నడు.

'ఈ మూడు నెలలు మనం కరీంనగర్ రాకుంటే పద్మను ఎలాగైనా పట్టుకునే వాళ్లం గదా....' రమ అన్నది.




''ఐదువందల కాశ పడి కరీంనగర్ పోతిమి...'' లింగం అన్నడు.

అది నిజంకాదని ఇద్దరికీ తెలుసు.

సేటు జీతం సంగతి చెప్పి ''కరీంనగర్ బ్రాంచికి పోతావురా లింగం'' అని అడిగిన రోజు రాత్రి భార్యాభర్తలిద్దరికీ వాదం జరిగింది.

లింగం ఏ కొద్ది టైం దొరికినా పద్మ కొరకే వెదుకుతున్నడు. రమ ఎప్పుడు బయటకు వెళ్లినా లక్ష్మి కోసమే చూస్తుంది.

మోరి పక్క గుడిసె ఎప్పుడూ తాళం వేసి ఉంటుంది. మున్సిపాలిటీ ఆఫీసు ముందు ఆవులు ఉంటున్నయి గని లక్ష్మి కన్పిస్తలేదు.

ఒకనాడు బాధగా ఇంటికి వచ్చిన లింగం రమతో 'పద్మ అక్కడ గూడా లేదటనే ... ఖాళీ చేసిందట. ఆమె గురించి అడుగుతుంటే వాళ్లంతా నన్ను అనుమానంగా చూసిండ్రే... ఎందుకో...' అన్నడు.

ఏ ఆలోచనల్లో ఉందో రమ. అంతే బాధతో ''లక్ష్మి గూడా తావు మారింది. అకులో అలమో దొరుకుతదని గుడి దగ్గెర ఉంది. ఇప్పుడు నేను ఇట్ల వస్తున్నా... రెండు గిత్తలు దానెంటపడ్డయి. దానికి నడువపోదామంటె ఓసరనే లేదు...' అన్నది.

ఇద్దరు వాదనకు దిగిన ఆ రాత్రి ఈ సంగతే చెప్పుకుంటూ ''మనం చెప్పుకుంటలేంగని... ఒకలకు తెలువకుంట ఒకలం ఒకే సమస్యతో బాధపడుతున్నం. దూరంగా వెళ్లిపోవుడే మంచిది. కొన్ని రోజులైతే అంతా మరిచిపోతం... ఇక్కడుంటె మాత్రం పిచ్చిలేసుడు ఖాయం'' ఇద్దరు అనుకున్నరు.

అది గుర్తు చేస్తూ ''కరీంనగర్ పోయినంక మరిచిపోయినమా...'' అన్నడు లింగం.

రమ మౌనంగా ఉంది. బస్సు సిరిసిల్ల చేరుకుంది. ఇద్దరూ దిగిండ్రు.

నీళ్లల్లో నాని నాని ఉబ్బిన పద్మ శవము మున్సిపాలిటీ చెత్తలో కుళ్లిన లక్ష్మి ఎముకల చూడబోతున్నందుకు ఇద్దరికీ భయం పట్టుకుంది.

ఎంత నిలదొక్కుకుని నడుద్దామన్నా ఇద్దరికీ కాళ్లు వణుకుతున్నాయి. కడుపులో దుఃఖం మసులుతుంది. సర్కారు దవాఖాన వైపు నడుస్తుంటే అడుగు అడుగుకూ వణుకు ఎక్కువవుతుంది.

పండ్ల బండ్లు ఆటోస్టాండు దాటి ఏటీయం దగ్గరికి రాంగనే ఆగిపోయింది రమ. ఒక అడుగు వెనుక ఉన్న లింగం రమను చూసి ఆగి చికెన్ సెంటర్ ముందున్న చెట్టు కింద చూసిండు.

అంబేద్కర్ చౌరస్తాలో వాహనాలను ఒడుపుగా తప్పించుకున్న లక్ష్మి కుడివైపుకు తిరిగి చెట్టుకింద ఆగింది. చెట్టు మొదట్లో అరటితొక్కను ఒడుపుగా నాలికతో అందుకుని ముందుకు నడిచింది.

లక్ష్మి నేర్చుకుందో... సిరిసిల్ల నేర్పిందో... వాహనాల నడుమ అది ఒడుపుగా పోతుంది.

★


చిరునామా :
పెద్దింటి అశోక్ కుమార్
సిరిసిల్ల, కరీంనగర్ జిల్లా
మొబైల్ : 94416 72428